## క్లుప్తంగా

### సుధాకర్‌కు అభినందన



ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన ఎస్.బి. 8వ అంతర్జాతీయ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన చొప్ప సుధాకర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరవాడ హెలిప్యాడ్ వద్ద అభినందించారు.

### నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

**సింహాచలం:** అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని బిల్వపత్రాలతో పూజించారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అర్చకులు పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించి దర్శనాలు కల్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈపూజలు జరిగాయి.

### క్షీరాభిషేకం.. కుంకుమార్చన



దేవీపురంలోని యాగశాలలో పారాయణ నిర్వహిస్తున్న అర్చకులు

**సబ్బవరం:** ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీయంత్ర మహామేరులోని అమ్మవారికి క్షీరాభిషేకం,కుంకుమ పూజలు చేశారు. మహా కాళీమాత ఉత్సవ మూర్తికి భక్తులు తమ స్వహస్తాలతో క్షీరాభిషేకాలు,కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం 28 కళశాలను స్థాపించి చండీ సప్తశతి పారాయణం జరిగింది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో శ్రీవిద్యా కుమారి గాత్రం,శ్రీసత్య విశాల్ వయోలిన్ ఆకట్టుకున్నాయి.

### వంట సామగ్రి వితరణ



ఈవో శ్రీనివాసమూర్తికి మిక్సీ అందిస్తున్న దాత జగదీష్

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం రూ. లక్ష విలువ చేసే వంట సామగ్రిని 98వవార్డు పరిధి అప్పన్నపాలేనికి చెందిన కానూరి జగదీష్, పల్లా సంతోష్, గోక జగదీష్, నోళ్ల పైడిరాజు అందజేశారు. సింహగిరిపై ఆ గ్యాస్ స్టౌవ్‌లు, మిక్సీ, టీ కేస్ తదితర వస్తువులను ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అప్పగించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఎస్.ఆశాకుమారి, ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

### నేడు ప్రజా వేదిక

**సబ్బవరం:**సామాజిక తనిఖీల మండల స్థాయి ప్రజా వేదిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 2020- 2023 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులు, సామాజిక భద్రతా పింఛన్లపై ఈ తనిఖీలు నిర్వహించారన్నారు. వీటిపై మండల స్థాయి ప్రజా వేదికలో విశ్లేషణ జరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెల్లడించడంతో పాటు వాటిపై చర్చ ఉంటుందన్నారు.



# ఆత్మీయత.. ఆప్యాయత

- సీఎం వైఎస్ జగన్‌కు సాదర స్వాగతం
- నాయకులను పేరుపేరునా పిలిచిన సీఎం
- పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



యుజియా పరిశ్రమను ప్రారంభించడానికి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**పరవాడ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఆప్యాయత.. ఆత్మీయత కలబోతగా సాగింది. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో రూ.750 కోట్ల వ్యయంతో అరబిందో యాజమాన్యం ఏర్పాటు చేసిన యుజియా ఔషధ పరిశ్రమను సీఎం వైఎస్ జగన్ సోమవారం ప్రారంభించారు. అంతకముందు హెలిప్యాడ్ వద్ద పార్టీ నేతలను సీఎం పేరుపేరునా పిలిచి ఆప్యాయంగా పలకరించారు. దీంతో నాయకుల్లో నూతన ఉత్సాహం కనిపించింది.

- సోమవారం ఉదయం 12.50 గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లతో కలిసి హెలికాప్టర్‌లో ఫార్మాసిటీకి చేరుకున్నారు.
- హెలిప్యాడ్ వద్ద ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, పెందుర్తి, నర్సీపట్నం, పాయకరావుపేట ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్‌గణేష్, గొల్లబాబూరావు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సీఎంకు సాదర స్వాగతం పలికారు.
- మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, రాంకీ ఎండీ లాల్‌కృష్ణ, లారస్ డైరెక్టర్ బూడేపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు ఇల్లపు ప్రసాద్, సీహెచ్.జమీలు, కోన రామారావు, చుక్క రామునాయుడు, పెదిశెట్టి శేఖర్ సీఎంకు ఘన స్వాగతం పలికారు.
- సీఎం హెలిప్యాడ్ వద్ద 12.55 నుంచి 1.05 వరకు నాయకులతో ఇంటరాక్ట్ అయ్యారు.
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు.
- సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసిన రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ నదియాకు సీఎం దీవెనలు అందజేశారు.
- కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని నదియా సీఎంకు వినతిపత్రం అందజేశారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు



తాడి గ్రామాన్ని తరలించాలని సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నదియా

# బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యం



కలపాకలో ర్యాలీ చేపట్టిన ప్రజలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**సబ్బవరం:**బాల్య వివాహ రహిత భారతావని లక్ష్యంగా సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సబ్బవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల కమ్యూనిటీ సోషల్ వర్కర్ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళలు,పిల్లలు, మండల,జిల్లా స్థాయి అధికారులు పాల్గొని బాల్య వివాహాలను అంతమొందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.


**కలపాకలో...**

**పరవాడ:** సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బాల్య వివాహ రహిత భారత దేశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భారత దేశంలో బాల్య వివాహాలకు చోటు లేదన్న సందేశాన్ని అందించడానికి ప్రజలు ముందుకు రావాలని సంస్థ ప్రతినిధులు కోరారు. కలపాక, భర్నికం, పరవాడ, తానాం, వెన్నలపాలెం తదితర గ్రామాల్లో బాల్య వివాహల వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ



మహేశ్వరిగా రాజశ్యామల అమ్మవారు



మహేశ్వరిగా రాజశ్యామల అమ్మవారు

**సింహాచలం:** శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజైన సోమవారం దుర్గమ్మ పలు రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవి బాలత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదాపీఠంలో రెండోరోజు సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలు విశేషంగా జరిగాయి. శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని మహేశ్వరిగా తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్లు అలంకరించారు. రాజశ్యామలా సమేత చంద్రమౌళీశ్వరులకు దేవతార్చన చేశారు. శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేశారు. లోక కల్యాణార్థం చేపట్టిన రాజశ్యామల, చండీ యాగం, శ్రీచక్ర నవావరణార్చన, దేవీ భాగవత పారాయణం కొనసాగాయి. సాయంత్రం సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐక్య ఉద్యమాలతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు

**సింథియా:** ఐక్య ఉద్యమాల ద్వారానే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం డాక్‌యార్డ్, ఇతర రక్షణ రంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనుబంధ సంస్థ ఈఎస్‌సీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. సభలో అచ్యుతరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ట్రేడ్ యూనియన్లు ఐక్య ఉద్యమాలకు దూరంగా ఉంటున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. నూతన పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సబ్బం కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉడతా అప్పలరాజు, ఉపాధ్యక్షులు మన్యాల ప్రసాద్‌బాబు, హెచ్.ఎం.ఎస్.మాజీ అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### తొలగించిన చెట్లకు పునర్జన్మ



చెట్లను తరలిస్తున్న సిబ్బంది

**ఏయూ క్యాంపస్:** తొలగించిన చెట్లకు తిరిగి ప్రాణం పోస్తున్నారు విశాఖలోని మహానగర పాలక సంస్థ అధికారులు. ఇటీవల కాలంలో పోలమ్మ గుడి నుంచి ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రం కలుపుతూ వీఎంఆర్‌డీఏ పార్క్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఇలా సోమవారం ఉదయం మెంటల్ హాస్పిటల్ జంక్షన్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను క్రేన్లతో జాగ్రత్తగా బయటకు తీశారు. వెంటనే చెట్ల వేళ్లు, ఎండిపోకుండా గోనె సంచి చుట్టి నీళ్లతో తడుపుతున్నారు. ముందుగా తీసి ఉంచిన గోతుల్లో వాటిని జాగ్రత్తగా పెట్టి మళ్లీ జీవం పోస్తున్నారు, రాణి చంద్రమణి హాస్పిటల్ దగ్గర తొలగించిన చెట్టుకు పునర్జన్మనిచ్చారు.

# అన్నపూర్ణగా వాసవీమాత



కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజకు వస్తున్న కన్యలు



అన్నపూర్ణాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

- కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక నివేదన
- అమ్మవారికి 102 మంది కన్యల పూజలు
- కలశాలతో యువతుల ప్రదక్షిణ

**డాబాగార్డెన్స్:** కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కురుపాం మార్కెట్ సమీపంలోని ఆలయంలో అమ్మవారిని బియ్యం బస్తాలతో అలంకరించారు. కంకటాల కృష్ణారావు, కుమారి దంపతులు, వారి కుమారులు సతీష్, నవీన్‌కుమార్ ఈ బియ్యం బస్తాలను అందించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్ బీబీ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

**నేత్రపర్వంగా కన్యల పూజ**

సంప్రదాయ వస్త్రాలను ధరించిన 102 మంది కన్యలతో అమ్మవారికి కన్యాపూజ జరిపించారు. పూజ అనంతరం కన్యలు అందరూ శుద్ధ జలంతో కూడిన కలశాలతో గ్రామ ప్రదక్షిణ చేశారు. దేవాలయం నుంచి పప్పుల వీధి, శివాలయం వీధి మీదుగా అమ్మవారి ఆలయం వరకు ప్రదక్షిణ సాగింది. సాయంత్రం పెన్నం వెంకటరత్నం నేతృత్వంలో సౌందర్యలహరి గ్రూప్‌చే భాగవతం కార్యక్రమం నిర్వహించారు.ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్ కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలిగా వసంతలక్ష్మి



వై.వసంతలక్ష్మి

**అల్లిపురం:** ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం విశాఖపట్నం అధ్యక్షురాలిగా న్యాయవాది వై.వసంతలక్ష్మి ఎన్నికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన సంఘం ఎన్నికల ఫలితాలను సంఘం కార్యదర్శి రాయి శ్రీనివాస, ఎన్నికల అధికారి కేపీ దేశాయ్ ప్రకటించారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.వి.లక్ష్మి, కె.నాగకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.విజయకుమార్, పద్మాబాయ్, సంయుక్త కార్యదర్శులుగా వి.జాన్‌డేవిడ్‌రాజు, వి.నీలిమ, వై.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.ఆనంద్‌కుమార్‌తో సహా 11 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. నూతన కార్యవర్గానికి బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణ్‌కుమార్, సంఘం మాజీ అధ్యక్షుడు పాకా సత్యనారాయణ, హేమామాలిని, కేఎస్ సురేష్‌కుమార్, సాకా రాజేంద్రప్రసాద్, బలగ సత్యారావు, టి.సత్యారావు అభినందనలు తెలియజేశారు.

# ప్రజలకు చేరువలో వైద్య సేవలు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పౌష్టికాహార స్టాల్స్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కలపాకలో కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది



రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు

**అగనంపూడి:** ప్రజల చెంతకు వైద్యసేవలు చేర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించడం అనేది మన రాష్ట్రంలో మాత్రమే ఉందన్నారు. ఇటువంటి పథకాలు మిగిలిన రాష్ట్రాల్లో లేవన్నారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, వార్డు నాయకులు సర్వసిద్ధి బొరయ్యనాయుడు, చట్టి తాతారావు, దాడి నూకరాజు, నారపిని అప్పలరాజు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, మాడిశ సత్యనారాయణ, పల్లా చిన్నా పాల్గొన్నారు.

### 650 మందికి వైద్య పరీక్షలు

**సబ్బవరం:** జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని మొగలిపురం సచివాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య పరీక్షలు చేసే బ్లాక్‌లతో పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. శిబిరంలో 650 మందికి సేవలందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, నాయకులు కొటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్ రాజ్,ఈవోఆర్డీ మహేష్, పార్టీ సీనియర్ నాయకులు శరగడం రాము,స్థానిక నాయకులు యడ్ల నాయుడు,ఐడీ బాబు, గండి ముత్యాలనాయుడు,సచివాలయ కార్యదర్శి సంతోషి ,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

### 460 మందికి వైద్య పరీక్షలు

**పరవాడ:** ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని కలపాక సర్పంచ్ బొండా కనకారావు అన్నారు. కలపాక గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కనకారావు సోమవారం ప్రారంభించారు. అనంతరం కనకారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రతీ గ్రామంలో పేదలకు మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్య శిబిరంలో 460 మందికి వైద్య నిపుణులు డాక్టర్ కనకఅప్పారావు, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ రాజ్‌ప్రేమ్, డాక్టర్ ఆస్మా అక్తర్ సుఫూర్ పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పి.బోనంగి సర్పంచ్ బందారు కల్పన రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సుబాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొగలిపురంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు, వైద్య సిబ్బంది

### కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

## ఆచార్యుల పరిశోధనలకు సహకారం



సదస్సులో పాల్గొన్న బీఐఎస్ ప్రతినిధులతో వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సోమవారం నిర్వహించిన ఒక రోజు సదస్సును వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. బీఐఎస్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా తొలి సదస్సును నిర్వహిస్తున్నామని వీసీ తెలిపారు. బీఐఎస్ ఏయూలో చెయిర్ ప్రొఫెసర్‌ని ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు మరింత ఎక్కువగా సేవలను అందిస్తూ, చేరువ చేయడం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ వస్తువులు, ఉత్పత్తులను ప్రామాణీకరించడం తదితర అంశాలను వివరించారు. బీఐఎస్ టెక్స్‌టైల్ విభాగం సీనియర్ డైరెక్టర్ జె.కె.గుప్త మాట్లాడుతూ ఆచార్యులు చేసే పరిశోధనలకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఐఎస్ శాస్త్రవేత్తలు టి.సుజాత, మనోజ్‌కుమార్ రాజక్, వైభవ్ జిందాల్, శుభం యాదవ్, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, అడ్జెంక్ట్ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మీనారాయణ, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హక్కులను హరించేందుకే ప్రైవేటీకరణ



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు భూనిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్‌ప్లాంట్ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం పావులు కదుపుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 977వ రోజు సోమవారం, స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.